

పలు ప్రాంతాల్లో భారీ వర్షం

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండలంలోని పలు ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి రోడ్లు, లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారాయి. పలుచోట్ల రోడ్ల పైకి వర్షం నీరు చేరడంతో డ్రెయినేజీలు పొంగిపొర్లాయి. లోతట్టు ప్రాంతాలు మునిగిపోవడం, జనవాసాల మధ్య వర్షం నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షం కారణంగా జనజీవనం స్తంభించింది. పలు చోట్ల గృహాల్లో నీరు చేరడంతో నివాసితులు అవస్థలు పడ్డారు.



వర్షం నీటితో నిండిన బ్యాంకు వీధి

ఉచితం కొన్ని బస్సులకే..

- జిల్లాలో రోజుకూ 45 వేల మంది మహిళలు ప్రయాణించే అవకాశం
- ఈ నెల 15న స్త్రీ శక్తి పథకం ప్రారంభం
- ఐదు రకాల బస్సుల్లోనే అనుమతి
- నెలకు 6.75 కోట్లు ప్రభుత్వానికి భారం

కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ లో ఇచ్చిన ప్రధాన హామీ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం. పాలన ప్రారంభమై ఏడాది దాటిన తర్వాత ఈ పథకం అమలుకు కసరత్తు చేస్తోంది. ఈ నెల 15 నుంచి మహిళలకు ఉచిత ప్రయాణం అవకాశం కల్పించాలని నిర్ణయించింది.స్త్రీ శక్తి అంటూ పథకానికి నామకరణం చేసింది. ప్రస్తుతం ఉన్న బస్సులు, పరిస్థితి పరిశీలిస్తే అమల్లో అనేక సవాళ్లు ఎదుర్కోక తప్పదని నిపుణులు భావిస్తున్నారు.

ప్రజాశక్తి - రాజోలు

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అమలాపురం, రాజోలు, రావులపాలెం, రామచంద్రపురాల్లో నాలుగు ఆర్‌టిసి డిపోలు ఉన్నాయి. వీటి పరిధిలో 298 బస్సులు ప్రజలకు సేవలందిస్తున్నాయి. వీటిలో 139 పల్లె వెలుగు బస్సులు, 26 ఆల్ట్రా పల్లెవెలుగు, 26 ఎక్స్‌ప్రెస్ సర్వీసులు, 23 ఆల్ట్రా డీలక్స్ బస్సులు, 58 సూపర్ లగ్జరీ బస్సులు, 21 ఇంద్ర ఏసీ బస్సులు, రెండు అమరావతి, నాలుగు నైట్ రైడర్లు ఉన్నాయి. మొత్తం బస్సులు రోజుకు 1.20 లక్షల కిలోమీటర్ల మేర ప్రయాణం చేస్తున్నాయి. రోజుకు సుమారు 90 వేల మంది వరకు ప్రయాణికులు ఆర్‌టిసి బస్సుల ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు. వీరిలో సుమారు 26 వేల మంది వరకు మహిళా ప్రయాణికులు ఉంటారని అంచనా. రాష్ట్రం మొత్తం ఉచిత ప్రయాణం అవకాశం కల్పిస్తున్నా... జిల్లాలోనే ఎక్కువగా మహిళలు ప్రయాణించే అవకాశం ఉంది. అమలాపురం - కాకినాడ నాన్ స్టాప్, రాజమహేంద్రవరం-అమలాపురం, రావులపాలెం-అమలాపురం, అమలాపురం-రాజోలు, రామచంద్రపురం- ఆలమూరు మధ్య తిరిగే బస్సులలో రద్దీ అధికంగా ఉంటుంది. అలాగే దూరపు సర్వీసులలో విశాఖ పట్నం, విజయవాడ, తిరుపతి, హైదరాబాద్‌కు ప్రయాణికుల తాకిడి అధికంగా ఉంటుంది. జాతీయ రహదారిపై ప్రయాణించే ఉదయం బస్సుల్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంది. విద్యార్థులు ఫుట్‌పాత్‌లపై వేలాడుతూ ప్రయాణం చేస్తున్నారు. తగిన సంఖ్యలో బస్సు లేవు.ఎక్కువగా ప్రయాణికులు ఆటోలపై ప్రయాణానికి ఆధారపడుతున్నారు. ఉచితం కావడంతో దాదాపుగా మహిళలు బస్సుల కోసం ఎదురు చూడవచ్చు. ఉదయం 10 లోపు, సాయంత్రం నాలుగు తర్వాత మహిళల రద్దీ ఎక్కువగా ఉంటుంది. బస్సులు అరకొరగా ఉన్నసమస్యగా మారవచ్చు. ఈ నేపథ్యంలో ఉచిత ప్రయాణానికి సరిపడే బస్సుల సంఖ్య ఉండాలి. జిల్లాలో కనీసం 50 వరకు అదనంగా బస్సులు అవసరం. భవిష్యత్‌లో ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి తేవాలని ప్రభుత్వ భావిస్తోంది. ఈ పథకం అమలుకు చాలా సమయం తీసుకున్న ప్రభుత్వం ఈ మేరకు ఏర్పాటు చేయలేకపోయింది. ఉచిత బస్సు అమలు కావడంతో 40 వేలు దాటి మహిళల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. మహిళల సంఖ్యకు తగ్గ బస్సులు లేకపోవడం ప్రధాన సమస్య. ప్రస్తుతం డ్రైవర్లకు, కండక్టర్లకు 20 సెక్షన్ ఇస్తున్నారు. మహిళలకు జీరో టిక్కెట్ ఇస్తారు. ఆధార్, ఓటు గుర్తింపు కార్డు, రేషన్ కార్డుల్లో ఒకటి చూపించాల్సి ఉంటుంది. జీరో టిక్కెట్కు ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ చెల్లించాల్సి ఉంటుంది. ఇది జాప్యమైతే ఆర్‌టిసి సంస్థ దివాలా తీస్తుంది. మరోపక్క ఆటో కార్మికులు, టాటా ఏస్, మ్యాజిక్ వంటి ఇతర వాహనాలు నడుపుతూ జీవిస్తున్న వారిపై తీవ్ర ప్రభావం ఒక ప్రశ్న చూపుతుంది. ఉపాధి కోల్పోయే అకాశం ఉంది. వీరిని ఎలా ఆదుకుంటారన్నది. ఉత్పన్నమవుతోంది. ఉచిత బస్సు ప్రయాణానికి కావలసిన బస్సులు, ఆక్యుపెన్సీతో సంబంధం లేకుండా గ్రామీణ ప్రాంతాల్లో బస్సులు నడపటం, విద్యార్థుల ట్రాన్స్‌పోర్ట్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవడం కీలకం.

రోజుకు రూ.45 లక్షల ఆదాయం

జిల్లాలోని నాలుగు ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. వీటి పరిధిలో 298 బస్సులు ప్రజలకు సేవలందిస్తున్నాయి. రోజుకు సుమారు 85 వేల మంది వరకు ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల ద్వారా రాకపోకలు సాగిస్తున్నారు. వీరిలో సుమారు 26 వేల మంది వరకు మహిళా ప్రయాణికులు ఉంటారని అంచనా. ఈ లెక్కన జిల్లా మొత్తం ఆర్‌టిసి రోజుకు రూ. 45 లక్షల ఆదాయం వస్తుండగా ఉచిత బస్సు కారణంగా నెలకు రూ.6.75 కోట్లు భారం ప్రభుత్వంపై పడనుంది.

పల్లెకు చేరని పల్లె వెలుగు..!

జిల్లాలో సుమారు 385 గ్రామాలున్నాయి. వీటిలో దాదాపు 135 గ్రామాలకు నేరుగా బస్సు సౌకర్యం లేదు. 75 గ్రామాలకు బస్సు సౌకర్యం ఉన్నప్పటికీ రోజులో ఒకటి రెండు ట్రిప్పులకు పరిమితమవుతున్నాయి. వీటిలో చాలా వరకు సముద్ర తీర ప్రాంత గ్రామాలు కావడం గమనార్హం. అయితే ఆర్‌టిసి లెక్క మరో విధంగా ఉంది మొత్తం జిల్లాలో 307 రెవెన్యూ గ్రామాలు ఉండగా, 256 గ్రామాల మీదుగా రాకపోకలు చేస్తున్నట్టు చెబుతోంది. పల్లెలకు బస్సు సౌకర్యం కల్పించకుండా మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేస్తే పెద్దగా ప్రయోజనం ఉండదని మహిళలు అభిప్రాయ పడుతున్నారు. మరీ ముఖ్యంగా సముద్ర తీర ప్రాంతాల్లోని గ్రామాలకు ఒకటి రెండు బస్సు సర్వీసులు మాత్రమే నడపడం వల్ల ఆ ప్రాంత మహిళలకు ఒరిగే ప్రయోజనం పెద్దగా కలగడం లేదు. అయితే ఉచిత ప్రయాణాన్ని పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్ బస్సులకు మాత్రమే పరిమితం చేయనున్నారు. దీనివల్ల మహిళలకు పెద్దగా ప్రయోజనం కలిగే అవకాశం లేదు. జిల్లా నుంచి విశాఖ, విజయవాడ, గుంటూరు, తిరుపతి వంటి ప్రధాన నగరాలకు సూపర్ లగ్జరీ, ఆల్ట్రా రోజులో ఒకటి రెండు ట్రిప్పులకు పరిమితమవుతున్నాయి. జిల్లాలో 9.34 లక్షల మంది మహిళలు ఉండగా, ప్రస్తుతం రోజుకు 25 వేల మంది వరకు ప్రయాణం చేస్తున్నారని అంచనా. ఉచిత ప్రయాణం మొదలైతే వీరి సంఖ్య రెట్టింపుకానుంది. సుమారు 45 వేల నుంచి 50 మంది మహిళలకు కేవలం 183 మాత్రమే బస్సులు ఉన్నాయి.



ప్రభుత్వ మార్గదర్శకాలు అమలు చేస్తాం

ఆగస్టు 15నుంచి ఉచిత బస్సు ప్రయాణానికి ఏర్పాట్లు చేస్తున్నాం. ట్రయిల్ రన్లు కూడా నిర్వహిస్తున్నాం.జిల్లాలో మహిళలు 183 బస్సులలో జిల్లా, రాష్ట్ర వ్యాప్తంగా ఉచితంగా ప్రయాణం చేయవచ్చు, ఇప్పటికే డ్రైవర్లకు, కండక్టర్లకు శిక్షణ ఇచ్చాం. వేగంగా టికెట్లు కొట్టడం, మహిళా ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవటం. లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం

-రాఘవ కుమార్, జిల్లా ప్రజా రవాణాశాఖ అధికారి

బస్సుల ఏర్పాటుపై దృష్టి సారించాలి

ఉచిత ప్రయాణం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల తర్వాత అమలు చేస్తోంది. అన్ని బస్సుల్లోను మహిళలకు ఉచితం కల్పిస్తే మరింత మేలు జరిగేది. మహిళా ప్రయాణికులకు సరిపడా బస్సులు జిల్లాలో లేవు. ముందుగా బస్సుల ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. ముందస్తు ఏర్పాట్లు లేకుండా అధికారులను తప్పుపడితే ప్రయోజనం ఉండదు.

-కె.వెంకటేశ్వరరావు, సిపిఎం జిల్లా కన్వీనర్

ఆశాల సమస్యల పరిష్కారానికి డిమాండ్

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ఆశా వర్కర్లకు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బి .ఎస్తేర్ రాణి డిమాండ్ చేశారు. నగర పంచాయతీ పరిధిలోని ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణ లోని జిల్లా కార్యాలయాల ప్రాంగణం లోని డిఎంహెచ్ఒ కార్యాలయంలో బుధవారం ఆశా వర్కర్ల సమస్యలపై సిఐటియు ఆధ్వర్యంలో జిల్లా వైద్యాధికారి ఛాంబర్ నందు డిఎంహెచ్ఒ డాక్టర్ దుర్గారావు దొరతో ఆశాలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. అరకొర వేతనాలతో పని చేస్తున్న ఆశా వర్కర్లను ప్రతి రోజూ సంతకం కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రావాలనే నిబంధనను ఉపసంహరించుకోవాలని, టార్గెట్లు పెడుతూ మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని, ట్యాబ్ ఇచ్చి సిమ్ లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని డిఎంహెచ్ఒ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై డిఎంహెచ్ఒ స్పందిస్తూ తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. అలాగే పల్లంకుర్రు, గెద్దనపల్లి, వీరవల్లిపాలెంల పిహెచ్‌సి పరిధిలో పని చేస్తున్న ముగ్గురు ఆశా వర్కర్లకు ఆరు నెలలుగా వేతనాలు పడకపోవడాన్ని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సిఐటియు పోరాట ఫలితంగా ఆశాలకు ఉద్యోగ విరమణ వయసు 62 సంవత్సరాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.లక్ష యాభై వేలు, ఆరు నెలల పాటు వేతనంతో కూడిన మెటర్నిటి బెనిఫిట్స్ సాధించుకున్నామన్నారు. సంఘటితంగా పోరాడి మరిన్ని హక్కులను సాధించుకోవాలని సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు దుర్గాప్రసాద్, బలరామ్ సూచించారు. ఈ సమావేశంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు ఉషారాణి, కనకదుర్గ, అన్నపూర్ణ, ఈశ్వరి, మంగాదేవి, రాజేశ్వరి ,సత్య శ్రీ ,స్వరూప తదితరులు పాల్గొన్నారు



ఆశాల సమస్యలపై డిఎంహెచ్ఒతో చర్చిస్తున్న సిఐటియు నాయకులు

నైట్ వాచ్‌మెన్ల వేతన బకాయిలు చెల్లించాలి

సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ప్రభుత్వ పాఠశాలల్లో రాత్రిపూట కాపలాదరులుగా పని చేస్తున్న నైట్ వాచ్ మెన్ వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరామ్ డిమాండ్ చేశారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలోని జిల్లా కార్యాలయాల ప్రాంగణంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట బుధవారం నైట్ వాచ్ మెన్ ల పెండింగ్ వేతన బకాయిల ను విడుదల చేయాలని చేపట్టిన ధర్నాకు బలరామ్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గత ఆరు నెలలుగా నైట్ వాచ్‌మెన్‌లకు వేతనాలు చెల్లించకుండా నిర్లక్ష్యం వహిస్తుం దన్నారు.ఈ విధానాన్ని విడనాడి సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, నైట్ వాచ్ మెన్ లకు పగటి పూట డ్యూటీలు వేస్తూ ప్రధానోపాధ్యాయులు ఒత్తిడి చేస్తున్నారని ఇది మంచి పద్ధతి కాదన్నారు. ఈ విధానాలను ఉపసంహరించుకోవాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ప్రధానోపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం వేతన బకాయిలను చెల్లించడంతో పాటు పలు సమస్యలను పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కార్యాలయం సూపరింటెండెంట్ నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాంబాబు, మురళీకృష్ణ, కె.సత్యం, సత్యనారాయణ, శ్రీనివాస్ రావు లతో పాటు పలువురు పాల్గొన్నారు.



వినతి పత్రం ఇస్తున్న జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి



ధర్నాలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని ధర్నా

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

స్మార్ట్ మీటర్లను రద్దు చేసి ప్రజలపై విద్యుత్తు చార్జీల నిలువు దోపిడీని ఆపాలంటూ బుధవారం అంగర గాంధీ సెంటర్ లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా భారత కార్మిక సంఘాల సమైక్య ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు, అఖిల భారత రైతు సంఘం జిల్లా నాయకులు వెంటపల్లి భీమశంకరం మాట్లాడుతూ ఆదాని కంపెనీకి చెందిన స్మార్ట్ మీటర్లు లను బలవంతంగా బిగిస్తున్నార న్నారు. తక్షణమే వాటిని నిలుపుదల చేసి ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో విద్యుత్ బారాలను ప్రజలపై మోపుతుందన్నారు.కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచి సామాన్య పేద ప్రజల నడ్డి విరుస్తున్నారన్నారు. ఆదాయాలు పెరగక ప్రజలు కరెంటు బిల్లులు కట్టలేక అనేక ఇబ్బందులు పడుతున్నార ని, చిరు, మధ్యతరగతి వ్యాపారుల పరిశ్రమలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని, ప్రజలు స్మార్ట్ మీటర్ల మీద అవగాహన పెంపొందించుకొని చైతన్యంతో వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టియు నాయకులు చింతా రాజారెడ్డి, మద్దిరెడ్డి వెంకటరాజు, నున్న రమేష్, కుమ్మిశెట్టి నాగేశ్వరరావు, వల్లూరి సుబ్బారావు, బి.కాశి, దంగేటి దుర్గారావు. గుత్తుల దుర్గారావు, రైస్ మిల్లు జట్టు కార్మికులు, తదితరులు, పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



రామచంద్రపురాన్ని కాకినాడ జిల్లాలో కలపాలి

ప్రజాశక్తి - రామచంద్రాపురం

రామచంద్రపురం నియోజవర్గంలోని కె.గంగవరం, రామచంద్రపురం రూరల్, మున్సిపాలిటీలను కాకినాడ జిల్లాలో విలీనం చేయాలంటూ రాష్ట్ర కార్మిక శాఖామంత్రి వాసంశెట్టి సుభాష్‌కు న్యాయవాది మాగాపు అమ్మిరాజు ఆధ్వర్యంలో న్యాయవాదుల బృందం విన్నవించింది. బుధవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేసింది. అమ్మి రాజు మాట్లాడుతూ జిల్లాల పునర్విభజనకు జరుగుతున్నకసరత్తులో భాగంగా భౌగోళికంగా అమలాపురానికి రామచంద్రపురం నియోజక వర్గం దూరంగా ఉందని ఇక్కడ ప్రజల కోరిక మేరకు కాకినాడ జిల్లాలో విలీనం చేసేందుకు మంత్రివర్గం దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని మంత్రి సుభాష్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది దోమ్మలపాటి సత్యనారాయణ, గాలింకి చిట్టిబాబు, టిడిపి నాయకులు రవ్వ భూషణం, ఆళ్ల బుజ్జి తదితరులు పాల్గొన్నారు. త్వరలోనే జెఎసి ఏర్పాటుచేసి ఆయా మండలాలు ఆయా పంచా యతీల తీర్మానాలు కూడా తీసుకుంటామన్నారు. ఆయా ప్రజా ప్రతి నిధులతోసమావేశం ఏర్పాటు చేస్తామన్నారు.

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా

పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద పిడిఎస్‌యు, పివైఎల్ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలకు రవాణా, పరిపాలనా సౌకర్యాలు సులభంగా అందుబాటులో ఉండే విధంగా కాకినాడ జిల్లాలో రామచంద్రపురం నియోజకవర్గ విలీనం చేయాలని, పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధు, పివైఎల్ నాయకులు వి. భీమా శంకరం డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ, రామచంద్రపురం నియోజకవర్గం అమలాపురం జిల్లా కేంద్రం నుంచి సుమారు 60 కిలోమీటర్ల దూరంలో ఉందన్నారు. గోదావరి నది వరదలు, తుఫానులు వంటి ప్రకృతి విపత్తుల సమయంలో రవాణా సౌకర్యాలు దెబ్బతినడం వల్ల జిల్లా కేంద్రానికి చేరుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. కాకినాడ జిల్లా ప్రధాన కేంద్రం కేవలం 25 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో పరిపాలనా సేవలు వేగంగా, సమయానికి అందే అవకాశం ఉందని అన్నారు. కార్యక్రమంలో ఎఐకెఎంఎస్ నాయకులు అంబటి కృష్ణ, చింతా రాజారెడ్డి, పిడిఎస్‌యు నాయకులు కె.నవీన్, లెక్చరర్స్ జె.ఎన్.కె.బాబు, పి.దేవి ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.



మంత్రి సుభాష్‌కు వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాదుల బృందం

రాజోలు ఎంపిపి ఎన్నిక ఏకగ్రీవం

- ఎంపిపిగా శ్రీ దుర్గ
- ఎంపిపి ఎన్నికకు వైసిపి డుమ్మా

ప్రజాశక్తి - రాజోలు

రాజోలు మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలిగా టిడిపికి చెందిన పొన్నమండ ఎంపిటిసి కడలి శ్రీ దుర్గ బుధవారం ఏకగ్రీవకంగా ఎన్నికయ్యారు. రాజోలు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పటిష్ట బందోబస్తు ఉత్కంఠ మధ్య జెసి నిశాంతి ఆధ్వర్యంలో ఎన్నిక కొనసాగింది.రాజోలు ఎంపిపిగా ఉన్న కేతా శ్రీనివాస్ ఆకస్మిక మృతి చెందడంతో అతని స్థానంలో నూతన ఎంపిపిగా బిసి రిజర్వు కావడంతో శ్రీ దుర్గను ఏకగ్రీవకంగా ఎన్నుకున్నారు. రాజోలు మండల పరిషత్‌కు 20 ఎంపిటిసి సభ్యులకుగాను టిడిపి 8, జనసేన 5, వైసిపి 5, స్వతంత్ర్య 2 ఉన్నారు. అయితే వైసిపికి చెందిన ఎంపిటిసి సభ్యులు ఎన్నికలలో పాల్గొన కుండా గైర్హాజరయ్యారు. వైసిపి ఎంపిటిసి సభ్యులు గైర్హాజరు అయినప్పటికీ కోరం పూర్తవ్వడంతో ఎన్నిక ప్రక్రియ ప్రారంభం కాగా కడలి శ్రీ దుర్గ ఉమ్మడి ఎంపిపి అభ్యర్థిగా ఒక్కరే నామినేషన్ వేశారు. ఆ నామినేషన్‌కు ఉపాధ్యక్షులు పొలమూరి శ్యాంబాబు బలపరిచారు.దీంతో ఎకగ్రీవకంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి డిఎల్‌పిఒ బొజ్జురాజు తెలిపారు.

విధులు సక్రమంగా నిర్వహించాలి

నూతనంగా రాజోలు ఎంపిపిగా ఎన్నికైన శ్రీ దుర్గ మండల పరిషత్ విదులు సక్రమంగా నిర్వహిం చాలని, ప్రజలకి అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఎంపిటిసి సభ్యులకు అందుబాటులో ఉంటు మండలాభివృద్ధికి కృషి చేయాలన్నారు. అమె ఎన్నిక పట్ల ఎంఎల్ఎ వరప్రసాద్, ఎంఎల్‌సి రాజశేఖరం అభినందనలు తెలియజేశారు .అనంతరం నూతన ఎంపిపి మాట్లాడుతూ మండల అభివద్ధికి అందురూ సహకరించాలన్నారు. ఈ అవకాశం కల్పించిన రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వెంకటేశ్వరావు, ఎండిఒ భాస్కర్, వైస్ ఎంపిపి ఆనందరాజు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు. నూతన ఎంపిపికి డెల్టా చైర్మన్ గుబ్బల శ్రీను, పెద్దాపురం నియొజకవర్గ పరిశీలకులు బోళ్ల వెంకటరమణ, చాగంటి స్వామి, మోకా పార్వతి, మంగెన నాని, సూరిశెట్టి శ్రీను, కాట్న రాజు, కూటమి నాయకులు అభినందనలు తెలిపారు.



ఎంపిపి శ్రీదుర్గకు ఎంఎల్ఎ తదితరుల అభినందన

బాధ్యత కలిగిన పౌరులుగా మెలగాలి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

విద్యార్థులు మత్తు పదార్థాల ముప్పుకు గురి కాకూడదని సమాజానికి బాధ్యత కలిగిన పౌరులుగా మెలగాలి అంగర ఎస్ఐ హరీష్ కుమార్ అన్నారు. బుధవారం అంగర శ్రీ సిద్ధార్థ జూనియర్ కళా శాల విద్యార్థులకు మత్తు పదా ర్థాల వినియోగం, వాటి దుష్ప్ర భావాలు తదితర అంశాలపై ఆయన విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో భాగంగా సైబర్ నేరాలు, మహిళా భద్రత, యువతలో పెరుగుతున్న మత్తు వ్యసనాల ప్రమాదాలు, తదితర వాటిపై విద్యార్థులకు వివరించారు. వాటిపై విద్యార్థులతో చర్చించారు. మాదక ద్రవ్యాలకు బానిస కావద్దని, జీవితాలను చీకటిమయం చేసుకోవద్దని విద్యార్థులకు సూచించారు. అనంతరం కళాశాలలో పర్యావరణ పరిరక్షణకు ఎస్ఐ హరీష్ కుమార్ మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వి. రాజా, వి.పరమేశ్వ రరావు, ప్రిన్సిపల్ రమణ, అధ్యాపకులు, శక్తి టీం మహిళా కానిస్టేబుల్ విజయలక్ష్మి, కానిస్టేబుల్ సత్యనారాయణ, విద్యార్థులు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ హరీష్ కుమార్

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - రాజోలు

జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరేందుకు యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని మలికిపురం ఎమ్‌విఎన్, జెఎస్, ఆర్‌విఆర్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎన్.ఆనంద మహని కోరారు. చెడు వ్యసనాల నిర్మూలనే లక్ష్యంగా బుధవారం నిర్వహించిన కార్యక్రమలో ఆమె మాట్లాడుతూ యువతరం వీలైతే దేశానికి సేవ చేయాలని కానీ దేశానికి భారం కాకూడదన్నారు. డ్రగ్ మహమ్మారిని తరిమికొట్టడంలో యువతదే కీలక పాత్ర అన్నారు. నేటి ప్రపంచంలో సామాజిక మాధ్యమాల్లో చూపించే చెడుకు ప్రభావితం కాకుండా దానిలోని నీతిని గుర్తించాలన్నారు. ఒక వ్యక్తి జీవితంలో మొదటి 25 సంవత్సరాలు చాలా కీలకం అని కష్టపడి చదివి లక్ష్యాన్ని నెరవేర్చుకున్నట్లైతే జీవితం చాలా అందంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు సిహెచ్.సత్యనారాయణ, నక్కా రమేష్ బాబు, టివి.ఆంజనేయులు, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ ద్వారా రైతులకు మెరుగైన సేవలు

ప్రజాశక్తి -మామిడికుదురు

సొసైటీ ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని ముత్యాల పాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఛైర్‌పర్సన్ సాగి వెంకట నరసింహరాజు (బాబ్జి రాజు) అన్నారు. ముత్యాల పాలెం సొసైటీ కార్యాలయంలో ఛైర్‌పర్సన్‌గా బుధవారం ఆయన ప్రమాణ స్వీకారం చేసి పదవి బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో పాటు పర్సన్‌లుగా నంద్యాల వెంకట తాతయ్య నాయుడు, కొల్లు సీతారాములు ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఛైర్ పర్సన్ మాట్లాడుతూ రైతు సమస్యలు గుర్తించి వాటి పరిష్కార మార్గాలు చూపిస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురు ఛైర్‌పర్సన్‌కు పూల మాలలు వేచి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో సిఇఒ మేడిచర్ల శ్రీరంగ ప్రసాదరావు, అల్లు సురేష్, మాజీ ఛైర్‌పర్సన్ సాగి పిఆర్‌విఎస్ఎస్.నరసింహ వర్మ, రైతులు పాల్గొన్నారు.



ముత్యాల పాలెం సొసైటీ త్రిమెన్ కమిటీకి రైతుల అభినందన

పూడుకు పోయిన ప్రధాన పంట కాల్వ

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

మండల కేంద్రమైన ఉప్పలగుప్తం, చీకట్లపాలెం, బడుగు పేట, మధుర పేట, పేరాయి చెరువు, ఏటిమెరక, వానపల్లిపాలెం తదితర గ్రామాల ఆయకట్టుకు సాగునీరు అందించే ఉప్పల గుప్తం ప్రధాన పంట కాలువ దుస్థితి పై రైతులు ఆందోళన చెందుతున్నారు. సాగు నీటి సంఘాల ఏర్పాటుతో పంట కాలువలకు మహర్దశ వస్తుందని ఆశించిన రైతులకు పంట కాలువల బాగోగులు పట్టించుకోకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉప్పలగుప్తం ప్రధాన పంట కాలువలో గుర్రపుడెక్క,తూడు దట్టంగా పెరిగిపోతున్నా పట్టించుకోవటం లేదని విమర్శిస్తున్నారు. రైతులకు సాగునీటి ఎద్దడి రాకుండా ముందుగానే ప్రజా ప్రతినిధులు సంబంధిత అధికారులు సాగు నీటి సంఘాలు పంట కాలువను ఆధునికీకరించాలని రైతుల కోరుతున్నారు.



ఉప్పలగుప్తం తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా పంట కాలువ దుస్థితి

ఘనంగా రైతు సంబరాలు

ప్రజాశక్తి - ఆలమూరు

మండల కేంద్రం లో బుధవారం రైతు సంబరాలు ఘనంగా నిర్వహించారు. సంబరాల్లో కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి రైతులు తరలి రావడంతో పాటు 200 పైగా ట్రాక్టర్లుతో చొప్పెల్ల, నవాబు పేట, కొత్తూరు సెంటర్ మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రధాని మోదీ, సిఎం చంద్రబాబు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ సూపర్ సిక్స్ సూపర్ హిట్ అంటూ నినాదాలతో వారి చిత్రపటాలకు ధాన్యాభిషేకం చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సభలో ఎంఎల్ఎ బండారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకంలో మొదటి విడతలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా రూ.2320 కోట్ల రైతుల ఖాతాలో జమ చేసిందని తెలిపారు. కొత్తపేట నియోజకవర్గంలో 23వేల మంది రైతులకు సుమారుగా రూ. 17కోట్లు జమ చేసిందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఆకుల రామ కృష్ణ, కొత్తపల్లి వెంకటలక్ష్మి,చిలువూరి సతీష్ రాజు, పాలూరి సత్యానందం తదితరులు పాల్గొన్నారు.



ట్రాక్టర్ ర్యాలీలో ఎంఎల్ఎ సత్యానందరావు

సమాచార హక్కు చట్టంపై అవగాహన

ప్రజాశక్తి - రామచంద్రపురం

నరసరావుపేట గ్రామ సచివాలయం వద్ద బుధవారం సమాచార హక్కు చట్టంపై అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు రామచంద్రపురం మండల వ్యవసాయ అధికారి మణిదీప్ ఆధ్వర్యంలో ఈ అవగాహనా సదస్సు నిర్వహించారు. ఎఒ మాట్లాడుతూ సమాచారం చట్టం 2005 గురించి పలు కీలక విషయాలు తెలియజేశారు. సెక్షన్ 6(1) ప్రకారం సమాచారం కోరి హక్కు ప్రతి ఒక్కరికి ఉంటుందన్నారు. సెక్షన్ 2 (జె) (11) ప్రకారం ప్రతీ పేజీని అధికారులు ధృవీకరించి ఇవ్వాలని తదితరు అంశాలను ఈ కార్యక్రమంలో ఎఇ ఒ. అజయకుమార్, నరసపురపుపేట గ్రామసర్పంచ్, ఎంపిటిసి సభ్యులు, పార్టీ నాయకులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

చీటింగ్ కేసులో నిందుతుని అరెస్టు

ప్రజాశక్తి - జగ్గంపేట

ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ వ్యక్తిగత సహాయకుడిని అంటూ చీటింగ్ చేసేందుకు యత్నించిన నిందుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం సిఐ వైఆర్కె.శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ అంబేద్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం గుడిమూలం గ్రామానికి చెందిన జి.రాజకుమార్ అలియాస్ వంశీ ఇటీవల గోకవరం ప్రాంత గోల్డ్ వ్యాపారి పట్నాల నాగేంద్ర ఫోన్ చేశాడు. తాను ఎంఎల్ఎ పిఎ అని పరిచయం చేసుకుని టిటిడి విఐపి దర్శనం టికెట్లు ఇప్పిస్తానని చెప్పాడు. దానికి రూ.50 వేలు ఖర్చు అవుతుందని చెప్పాడు. దీంతో అప్రమత్తం అయిన గోల్డ్ వ్యాపారి ఎంఎల్ఎ పిఎ ప్రసాద్‌కు సమాచారం అందించడంతో ఆయన స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు కిర్లంపూడి ఎస్ఐ జి.సతీష్ నేతృత్వంలో ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. సాంకేతిక పరిజ్ఞానంతో అతను గోవా ప్రాంతంలో ఉన్నట్లు గుర్తించి అరెస్ట్ చేశారు. అతన్ని కోర్టులో హాజరు పరుస్తామని సిఐ వైఆర్కె శ్రీనివాస్ తెలిపారు. రాజ్ కుమార్‌పై పలు చోట్ల చీటింగ్ కేసులు ఉన్నాయని చెప్పారు.

బైకు చోరీ కేసుల్లో నిందితుల అరెస్టు ..18 బైకుల స్వాధీనం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

వరస బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న వారిని అరెస్టు చేసి, 18 బైకులను స్వాధీనం చేసుకున్నట్టు సెంట్రల్ జోన్ డిఎస్‌పి కె.రమేష్ బాబు తెలిపారు. ప్రకాష్ నగర్ పోలీస్ స్టేషన్ పరిదిలో బైక్ దొంగతనాలు చేసే వ్యక్తుల మీద ప్రకాష్ నగర్ పోలీసులు సిఐ బాజీలాల్ అధ్వర్యంలో నిఘా పెట్టారు. బుధవారం రాజమహేంద్రవరం ఆర్‌టిఒ ఆఫీస్ వద్ద వాహనాల తనిఖీలో కాకినాడకు చెందిన ఇంటి సురేంద్ర, కామిరెడ్డి ఏసుబాబును అరెస్టు చేసినట్టు తెలిపారు. ఈ కేసులో ప్రతిభ కనపరిచిన సిఐ బాజీలాల్, ఎస్ఐ జి.సతీష్ హెచ్‌సిలు వి.నాగరాజు, సిహెచ్.శ్రీనివాసరావు, కానిస్టేబుల్స్ ప్రదీప్ కుమార్, వీరబాబు, దుర్గప్రసాద్, శివ ప్రసాద్‌ను ఎస్‌పి డి.నరసింహ కిషోర్ అభినందించి రివార్డ్ ప్రకటించారు.


తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

రేషన్ షాపుల్లో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి-గోపాలపురం

ప్రభుత్వ పౌరసరఫర రేషన్ దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. జిల్లా విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ జి.మధుబాబు, విజిలెన్స్ డిసిటిఒ ఎం.నవీన్ కుమార్ గోపాలపురంలో రేషన్ షాపుల్లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. వచ్చిన స్టాకుకు ప్రస్తుతం ఉన్న స్టాక్‌కు సంబంధించినవి పరిశీలించారు. షాప్ నెంబర్ 2లో 13 ప్యాకెట్ల 6.5 కేజీల పంచదార ఉండవలసిన దానికన్నా అధికంగా ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. దీనిపై 6ఎ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో విఆర్ఒ జివివి.లక్ష్మి, విజిలెన్స్ కానిస్టేబుల్ లోవరాజు పాల్గొన్నారు.

ఘనంగా తిరంగా యాత్ర

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండల కేంద్రమైన కపిలేశ్వరపురంలో బుధవారం కూటమి నాయకుల ఆధ్వర్యంలో విద్యార్థుల తో తిరంగా యాత్ర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌లో పాక్ ఆక్రమిత కాశ్మీరులోని ఉగ్రవాదుల స్థావరాలను ధ్వంసం చేసి ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేసిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా తిరంగా యాత్ర కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. ఈ యాత్రలో జాతీయ జెండాలు చేత పట్టుకుని దేశభక్తి నినాదాలు చేస్తూ సైనికులకు మద్దతు పలికారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల అభివృద్ధిపై దృష్టి

ప్రజాశక్తి - సామర్లకోట

ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం దృష్టి సారించిందని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. బుధవారం స్థానిక జడ్‌పి బాలికల ఉన్నత పాఠశాలలో స్వర్గీయ సూరపురాజు జైభార్గవ్ జ్ఞాపకార్థం స్థానిక రైతు సంఘ నాయకులు కంటే జగదీష్‌మోహన్ తల్లిదండ్రులు సుమారు రూ.4 లక్షల వ్యయంతో నిర్మించిన భోజనశాల, ఆర్ఒ ప్లాంట్‌ను జై భార్గవ్ జయంతి సందర్భంగా ఎంఎల్ఎ ప్రారంభించారు. హెచ్ఎం రాయుడు విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాఠశాలలో సమస్యలు ఏమైనా ఉంటే లిఖితపూర్వకంగా అందజేస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. భోజనశాల, ఆర్ఒ ప్లాంట్ ఏర్పాటు చేసిన కంటే బాబును ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎతోపాటు, కంటే బాబును పాఠశాల సిబ్బంది, ఎస్ఎంసి సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు వై.శివరామ కృష్ణయ్య, పి.పుల్లయ్య, టిడిపి నాయకులు రాజా సూరిబాబు రాజు, బడుగు శ్రీకాంత్, బలుసు వాసు, ఎంఎంసి వైస్ చైర్మన్ పచ్చాకుల లోవరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేషన్ షాపు పరిశీలన

ప్రజాశక్తి - గొల్లప్రోలు

స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆర్ఐగా బాధ్యతలు స్వీకరించిన అసిస్టెంట్ కలెక్టర్ మనీషా బుధవారం పట్టణంలోని 6వ నెంబర్ రేషన్ షాప్‌ను పరిశీలించారు. షాపులో లబ్ధిదారులకు అందిస్తున్న సరుకుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలంలోని చేబ్రోలు గ్రామంలో అక్రమంగా నిర్మిస్తున్న లే అవుట్లను ఆమె పరిశీలించారు. ఈ పర్యటనలో ఆర్ఐ బాలకృష్ణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భారీ వర్షంతో తప్పని అవస్థలు


ముమ్మిడివరం తహశీల్దార్ కార్యాలయంలోకి చేరిన వర్షం నీరు

- జలమయమైన ప్రభుత్వ కార్యాలయాలు, కాలనీలు
- స్తంభించిన జన జీవనం
- అధికార యంత్రాంగం అప్రమత్తం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షానికి రోడ్లు,కాలనీలు మరియు ప్రభుత్వ కార్యాలయాలు జలమయమయ్యాయి. మండలంలోను, నగర పంచాయతీ పరిధిలోనూ బుధవారం మధ్యాహ్నం నుంచి ఏకధాటిగా ఎడతెరపిలేని వర్షం కురిసింది. తహశీల్దార్ కార్యాలయం, వ్యవసాయ శాఖ, ట్రెజరి,పోలీసు స్టేషన్ లోకి మోకాలు లోతు నీరు చేరడంతో చెరువులను తలపించాయి. పలు పంట చేలు నీట మునిగి చెరువులుగా దర్శనమిస్తున్నాయి. జాతీయ రహదారి 216పై ప్రభుత్వ కార్యాలయాల ఎదుట భారీ వృక్షం నేల కూలడంతో ట్రాఫిక్ కు అంతరాయం కలిగింది. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన చెట్టును తొలగించి రాకపోకలు కొనసాగే విధంగా చర్యలు తీసుకున్నారు రానున్న 48 గంటల పాటు భారీ వర్షాల ప్రభావం ఉండనే హెచ్చరికల నేపథ్యంలో ఎటువంటి విపత్తు ఎదురైనా పరిష్కరించేందుకు యంత్రాంగాన్ని సన్నద్ధం చేసినట్లు తహశీల్దార్ సుభాష్ తెలిపారు.


ముమ్మిడివరంలో వర్షానికి నీట మునిగిన వరిచేలు

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - పి.గన్నవరం

సహకార సంఘాలు పాలకవర్గం రైతుల సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ సూచించారు. ఉడిమూడి ప్రైమరీ అగ్రికల్చర్ కో-ఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన పెన్నమరెడ్డి వెంకటరత్నం నాయుడు, పర్సన్‌లకు పుష్పగుచ్ఛం అందించి ఎంఎల్ఎ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రసన్నకుమార్, నగరం ఎఎంసి ఛైర్‌పర్సన్ పెనుమాల లక్ష్మి, ఎంపిపి గనిశెట్టి నాగలక్ష్మి శ్రీనివాస్, జనసేన ఉపాధ్యక్షులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, పి.గన్నవరం సొసైటీ ఛైర్‌పర్సన్ సాధనాల వీర వెంకట సత్యనారాయణ (జెడి), అంబాజీపేట సొసైటీ ఛైర్మన్ అరిగెల సూరిబాబు, ఎఎంసి డైరెక్టర్ పెంటా ఏసుకుమారి, ఆదిమూలం సూరయ్య కాపు, మండల జనసేన ఉపాధ్యక్షులు కొమ్ముల శ్రీనివాసరావు, కూటమి నాయకులు ఛైర్‌పర్సన్‌కు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.


ఉడిమూడి ఛైర్మన్‌ను సత్కరిస్తున్న ఎంఎల్ఎ గిడ్డి, ఎఎంసి ఛైర్‌పర్సన్ పెనుమాల లక్ష్మి

ఘనంగా శ్రీనివాసరావు పుట్టినరోజు వేడుకలు


గన్నవరపు శ్రీనివాసరావు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి - అయినవిల్లి

పి.గన్నవరం నియోజకవర్గ వైసిపి కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు 50వ పుట్టినరోజు వేడుకలు ఆయన స్వగృహం అయినవిల్లిలో బుధవారం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా పి.గన్నవరం నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు సమక్షంలో కేక్ కట్ చేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం అయినవిల్లి మండలం అయినవిల్లిలో వైసిపి కార్యాలయం ప్రారంభించారు. పి.గన్నవరం నియోజకవర్గం వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధితులకు సెల్‌ఫోన్ల అప్పగింత

ప్రజాశక్తి - ఆలమూరు


బాధితుడికి సెల్‌ఫోన్‌ను అందజేస్తున్న ఎస్ఐ

మండలంలో గత మూడు నెలల నుంచి వివిధ కారణాల రీత్యా పోగొట్టుకున్న లేదా చోరీకి గురయ్యిన 39 మొబైల్స్‌ను గుర్తించామని ఆలమూరు ఎస్ఐ జి.నరేష్ అన్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో పోలీసులు ప్రస్తుతం రికవరీ చేసిన ఏడు మొబైల్స్‌ను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా బుధవారం ఎస్ఐ నరేష్ విలేకరులతో మాట్లాడుతూ మొబైల్స్ పోగొట్టుకున్న వారు ఆందోళన చెందవద్దన్నారు. మొబైల్స్ పోయిన వారి కోసం ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో ఫిర్యాదు చేసుకోవాలన్నారు. ఆయాప్‌లో పోగొట్టుకున్న సెల్‌ఫోన్ వివరాలు నమోదు చేస్తే సత్వరమే సమీప పోలీసు స్టేషన్ విచారణ చేపడుతుందన్నారు. ప్రస్తుతం వారం రోజుల వ్యవధిలో ఏడు సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశామన్నారు. మిగిలిన ఫోన్లను కూడా త్వరలో రికవరీ చేసి బాధితులకు అందజేస్తామని ఆయన భరోసా కల్పించారు. ఇతర వివరాలకు పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలన్నారు.


బాలయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ శ్రీకాంత్, నాయకులు

మృతుని కుటుంబానికి డాక్టర్ శ్రీకాంత్ పరామర్శ

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

చినగాడవిల్లి కి చెందిన వడ్డి బాలయ్య ఇటీవల మృతి చెందారు. బుధవారం ఆ కుటుంబ సభ్యులను అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైసిపి కో-ఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ పరామర్శించారు. బాలయ్య చిత్రపటానికి డాక్టర్ శ్రీకాంత్, నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. మృతుని కుటుంబానికి తమ ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని తెలిపారు. పరామర్శించిన వారిలో వైసిపి మండల అధ్యక్షుడు బద్రి బాబ్జి,బడుగు జ్యోతి బాబు తదితరులు ఉన్నారు.

రెడ్డి అనంతకుమారికి ఘన సత్కారం

ప్రజాశక్తి - అయినవిల్లి

ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక కార్పొరేషన్ ఛైర్‌పర్సన్‌గా నియమితులైన రెడ్డి అనంత కుమారిని అయినవిల్లి మండలం టిడిపి నాయకులు ఘనంగా సత్కరించారు. బుధవారం ఆమెను స్వగృహంలో మర్యాదపూర్వకంగా టిడిపి నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఆమెను దుశ్శాలువాతో సత్కరించి అయిన విల్లి విఘ్నేశ్వరస్వామి చిత్రపటాన్ని బహూకరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ సయ్యపరాజు సత్యనారాయణ రాజు, ఎఎంసి ఛైర్మన్ చిట్టూరి శ్రీనివాస్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి మద్దాల సుబ్బారావు, మాజీ ఎంపిప సలాది పుల్లయ్యనాయుడు, సొసైటీ ఛైర్మన్లు బిక్కిన బాబి, వర్రే శ్రీనివాస్, టిడిపి మండల అధ్యక్షుడు వస్కాశ్యామ్, కార్యదర్శి అంజిబాబు, టిడిపి కో- క్లస్టర్ తోటకూర నాగజోగి వర్మ, విళ్ళ నవీన్ పాల్గొన్నారు.

విలీన గ్రామాల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

రూరల్ మండలంలోని విలీన గ్రామాల సమస్యలను డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ ప్రత్యేక చొరవ చూపి పరిష్కరించాలని సిపిఎం రూరల్ మండల కమిటీ డిమాండ్ చేసింది. ఈ నెల 15న కాకినాడలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొననున్న పవన్‌కల్యాణ్‌కు అందజేసే వినతిపత్రాన్ని సిపిఎం మండల కమిటీ కార్యదర్శి తిరుమలశెట్టి నాగేశ్వరరావు బుధవారం మీడియాకు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని తూరంగి, ఇంద్రపాలెం, చీడిగ, వలసపాకల, వాకలపూడి, రమణయ్యపేట 6 పంచాయితీలకు 14 ఏళ్ళుగా పాలకవర్గాలు లేకుండా పోయాయని అన్నారు. దీంతో ఆర్థిక సంఘం నిధులు, ప్రత్యేక గ్రాంట్‌లు రాక గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. కావున ఆరు గ్రామపంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక గ్రాంట్‌గా రూ.240 కోట్ల నిధులు అత్యవసరంగా విడుదల చేయాలని ఆయన కోరారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ముమ్మిడివరం ఐసిడిఎస్ సిడిపిఒ ఎం.నిహారిక సూచించారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక డాక్టర్ మోకా గణపతి రావు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం కళాశాల ప్రిన్సిపల్ పి లక్ష్మీ ప్రసన్న ఆధ్వర్యంలో జరిగిన మాదకద్రవ్యాల నియంత్రణపై జరిగిన అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా నిహారిక ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మాదక ద్రవ్యాలైన గంజాయి, గుట్కా, వంటి చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని, భవిష్యత్తుకు బంగారు బాట వేసుకుని సమాజాన్ని ఆదర్శవంతంగా తీర్చి దిద్దడంలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, పీపుల్ సర్వీస్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కన్నిడి వెంకటేశ్వర రావు,జిల్లా బాలల పరిరక్షణ కమిటీ సభ్యురాలు మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


ఉప్పలగుప్తంలో ట్రాక్టర్ల ర్యాలీని ప్రారంభిస్తున్న నానాజీ

అన్నదాత సుఖీభవ ర్యాలీకి తరలిన కూటమి శ్రేణులు

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

అమలాపురం రూరల్ మండలం పేరూరు వై జంక్షన్ నుంచి భట్నవిల్లి వరకు బుధవారం నిర్వహించిన అన్నదాత సుఖీభవ ట్రాక్టర్ల ర్యాలీకి మండలం నుంచి కూటమి శ్రేణులు పెద్ద ఎత్తున ట్రాక్టర్లతో ర్యాలీగా తరలి వెళ్లారు. ఉప్పలగుప్తంలో టిడిపి మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ పచ్చ జెండా ఊపి ట్రాక్టర్ల ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సహకార సొసైటీ అధ్యక్షులు చిక్కం ఉమేష్, సాగునీటి సంఘ అధ్యక్షుడు నల్లా సత్యనారాయణ, కూటమి నాయకులు రవణం మధు, పెయ్యల దుర్గారావు,చిక్కం దుర్గారావు,చిక్కం కాసు,చిక్కం భీముడు, నాగులపల్లి పాపయ్య రాజు,పెయ్యల చిట్టిబాబు, మధుర ప్రతాప్, మధుర శ్రీను, గెడ్డం మోహన రావు రైతులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎ బండారుకు మంత్రి లోకేష్ పరామర్శ

ప్రజాశక్తి - కొత్తపేట

ఆలమూరు లో జరిగిన అన్నదాత సుఖీభవ రైతుల కార్యక్రమంలో తృటిలో ప్రమాదం నుండి బయటపడిన కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావును బుధవారం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఫోన్ చేసి పరామర్శించారు. ముందుగా ఎంఎల్ఎ సత్యానందరావు కు ఫోన్ చేయగా ఆయన ఫోన్ కు అందుబాటులో లేరు. దీంతో సత్యానందరావు తనయుడు బండారు సంజీవ్ కు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కేంజవరపు అచ్చం నాయుడు పలువురు మంత్రులు సహచర ఎంఎల్ఎలు, కలెక్టర్, ఎస్‌పి తదితరులు ఎంఎల్ఎ బండారును పరామర్శించారు

సతీష్‌రాజుకు ఎంఎల్ఎ సత్యానందరావు పరామర్శ

ప్రజాశక్తి - రావులపాలెం


పరామర్శిస్తున్న ఎంఎల్ఎ బండారు

రైతు సంబరాల్లో ఎడ్ల బండి పైనుంచి కింద పడి గాయ పడిన జిల్లా తెలుగు యువత అధ్యక్షులు చిలువూరి సతీష్ రాజును ఎంఎల్ఎ బండారు సత్యానందరావు పరామర్శిం చారు. ఆలమూరు లో బుధవారం నిర్వహించిన రైతు సంబరాల్లో జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు సతీష్ రాజు ఎడ్ల బండి పై నుంచి గాయపడ్డారు. స్థానిక ప్రయివేటు ఆసుపత్రిలో వైద్య చికిత్స పొందుతుండగా ఎంఎల్ఎ సత్యానందరావు పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. కాలు ఫ్రాక్చర్ కావడంతో రెండు మూడు, రోజుల్లో శస్త్ర చికిత్స చేయాలని డాక్టర్లు తెలియజేయడంతో మెరుగైన వైద్యం అందించాలని కోరారు. పరామర్శించిన వారిలో రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, గుత్తుల పట్టాభిరామారావు, కంఠంశెట్టి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

రైతు శ్రేయస్సే కూటమి ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - కరప

రైతు శ్రేయస్సే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎంపి ఉదయ్‌శ్రీనివాస్, ఎంఎల్ఎ పంతం నానాజీ అన్నారు. బుధవారం తూరంగి గ్రామం నుంచి కరప మండలం వేళంగి గ్రామం వరకూ అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిదారులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వేళంగిలో ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో నగదును రైతు అకౌంట్లో జమ చేయడం జరిగిందన్నారు. తొలుత మోడీ, చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడిపూడి సత్తిబాబు, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, టిడిపి రూరల్ కో కో-ఆర్డినేటర్ కటకంశెట్టి బాబీ, టిడిపి నాయకులు నురుకుర్తి వెంకటేశ్వరరావు, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, ఎస్‌సి కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లాబత్తుల అప్పారావు, ఎస్‌టి కార్పొరేషన్ డైరెక్టర్ వల్లూరి రాజా, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రకాష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పోరాటానికి అఖిలపక్షం మద్దతు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

మూడు నెలల బకాయి జీతాలను చెల్లించాలని ఇంద్రపాలెం పంచాయతీ కార్మికులు చేపట్టిన పోరాటానికి గ్రామ అఖిలపక్ష కమిటీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఒక నెల జీతాన్ని కార్మికులకు అందజేయడంతో అఖిలపక్ష నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్నులు వసూలు చేసి కార్మికులకు జీతాలు ఇవ్వడానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇంద్రపాలెం అఖిల పక్ష కమిటీ కన్వీనర్ చింతపల్లి ఉదయభాస్కర్, టిడిపి నాయకులు నెహ్రూ, జనసేన నాయకులు మణికుమార్, వైసిపి నాయకులు పలివెల శ్రీనివాసు, సిపిఎం నాయకులు వాసంశెట్టి చంద్రరావు, సిఐటియు మండల కార్యదర్శి తొట్టిపూడి రాజా, పంచాయతీ యూనియన్ నాయకులు చింతపల్లి అజయ్‌కుమార్ పాల్గొన్నారు.